క్లుప్తంగా

నేడు వైఎస్సార్ వర్ధంతి

చంద్రగిరి: దివంగత మాజీ సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి వర్ధంతి పురస్కరించుకుని సోమవారం ఉదయం 9 గంటలకు స్థానిక టవర్‌క్లాక్ వద్ద వైఎస్సార్‌కు నివాళులర్పించనున్నట్టు ఘనంగా నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు పార్లపల్లి చంద్రశేఖర్ రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అనంతరం పెద్దఎత్తున అన్నదానం చేస్తామని, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, మాజీ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి హాజరు అవుతారని, పార్టీ నాయకులు, ప్రజలు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

నేడు డ్రగ్స్ అనర్థాలపై అవగాహన

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీలో సోమవారం 'డ్రగ్స్ అబ్యూస్' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నారు. దీనికి ఏపీ స్టేట్ మహిళా కమిషన్ చైర్మన్ గజ్జల వెంకట లక్ష్మి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు.

పాకాలవాసికి గౌరవడాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న సాకం కృష్ణమూర్తి

పాకాల: మండలంలోని వరదప్పనాయుడుపేటకు చెందిన సామాజిక సేవకుడు సాకం కృష్ణమూర్తి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. ఆదివారం ఏషియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఏసియ కల్చరల్ అకాడమి కర్ణాటకలోని హోసూర్‌లో అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించింది. 25 ఏళ్లుగా రియల్స్ స్వచ్ఛంద సంస్థ తరపున తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో పలు సామాజిక సేవలకు గుర్తింపుగా ఈ డాక్టరేట్ అందజేశారని కృష్ణమూర్తి పేర్కొన్నారు.

రాయలసీమలో పార్టీని విస్తరింపజేయాలి



కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి(అలిపిరి): రాయలసీమలోని ప్రతి నియోజకవర్గంలో జనసేన పార్టీని విస్తరింపజేయాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు. ఆదివారం జనసేన అధ్యక్షులు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ముందస్తు జన్మదిన వేడుకలను తిరుపతిలోని ఓ కల్యాణ మండపంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కేక్ కట్ చేసి పవన్‌కు ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదులో ఎక్కువ మందిని చేర్పించిన వారికి జ్ఞాపికలు అందించి సన్మానించారు. కార్యక్రమంలో జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు డాక్టర్ హరిప్రసాద్, జనసేన నాయకులు వూసా మాధవ రావు, ఆరణి శివ కుమార్, కిరణ్ రాయల్, కీర్తన, ఆకేపాటి సుభాషిణి, ముక్కు సత్యవంతుడు, నైనార్ శ్రీనివాస్, కార్పొరేటర్ సత్యనారాయణ, రాజేష్ ఆచారి, ఆనంద్ పాల్గొన్నారు.

నూతన ఆర్టీసీ సర్వీసులు ప్రారంభం

పాకాల : స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నుంచి వివిధ ప్రాంతాలకు నూతన ఆర్టీసీ సర్వీసులను ఆదివారం చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ప్రారంభించారు. తిరుపతి–బెంగుళూరు, తిరుపతి–కాణిపాకం వయా పాకాల ఆర్టీసీ సర్వీసులను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సర్వీసులను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఏటీఎంలపై ఎందుకింత నిర్లక్ష్యం!

- భారీ చోరీ జరిగినా అప్రమత్తం కాని అధికారులు
- స్పష్టంగా కనిపిస్తున్న నిర్వహణ లోపం
- ఒక్క ఏటీఎం కేంద్రంలోనూ కనిపించని సెక్యూరిటీ సిబ్బంది



కొత్తపేటలోని కోసూరు కాంప్లెక్స్ ఏటీఎంలో కానరాని సెక్యూరిటీ

చంద్రగిరి: బ్యాంకు వినియోగదారులు తక్షణమే అవసరం మేరకు నగదును తీసుకునేందుకు ఏర్పాటు చేసిన ఏటీఎంల నిర్వహణపై అధికారుల నిర్లక్ష్యధోరణి వీడనాడలేదు. ఫలితంగా ఏటీఎం కేంద్రాలను టార్గెట్ చేస్తూ దొంగలు రెచ్చిపోతున్నారు. శుక్రవారం తెల్లవారుజామున చంద్రగిరి కొత్తపేటలోని ఎస్‌బీఐ ఏటీఎంలో భారీ చోరీ జరిగినా, వాటికి రక్షణ కల్పించడంలో ఆయా బ్యాంకులు అధికారులు మాత్రం నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నారు.

ఎక్కడా కనిపించని సెక్యూరిటీ

చంద్రగిరి పట్టణంలో జాతీయ, గ్రామీణ బ్యాంకులతో పాటు మరికొన్ని ప్రైవేటు బ్యాంకులకు సంబంధించిన 9 ఏటీఎం కేంద్రాలు ఉన్నాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు మినహా ఏ బ్యాంకుకు చెందిన ఏటీఎం సెంటర్ వద్ద కూడా సెక్యూరిటీ ఏర్పాటు చేసిన దాఖలాలు కనిపించడం లేదు. ఏటీఎం కేంద్రాల వద్ద అపరిశుభ్రత నెలకొనడం, ఏసీలు పనిచేయక పోవడంతో, మిషన్లు తరచూ మొరాయిస్తున్నాయి. సాంకేతిక సమస్యలు రావడం, చోరీ జరిగిన సమయంలో అలారం మోగకపోవడం వంటి లోపాలు కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి. చంద్రగిరి బస్టాండ్ సమీపంలోని ఎస్‌బీఐ, యాక్సిస్ బ్యాంకుల ఏటీఎం కేంద్రాల వద్ద శునకాలు ఆవాసాలు ఏర్పరుచుకున్నాయి. దీంతో ఖాతాదారులు అటువైపు వెళ్లాలంటేనే భయాందోళనకు గురవుతున్నారు.

ఎస్పీ సూచించినా చర్యలు శూన్యం

ఏటీఎం కేంద్రాల వద్ద చోరీలు జరగకుండా ఆయా బ్యాంకు అధికారులు నిర్లక్ష్యధోరణిని విడనాడి సెక్యూరిటీ సిబ్బందిని ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీ బ్యాంకు అధికారులకు సూచించారు. అయితే అందుకు భిన్నంగా బ్యాంకు అధికారులు వ్యవహరించడంతో ఖాతాదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కనీస సౌకర్యాలను కల్పించడంలో కూడా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఏటీఎం కేంద్రాల వద్ద ఇలాంటి నిర్వహణ లోపాలు ఉంటే ఇక చోరీలు జరగకుండా ఉంటాయా అంటూ ప్రశ్నిస్తున్నారు.

బీమా చేసుకోవచ్చనే ధీమాతోనే నిర్లక్ష్యం

ఏటీఎం కేంద్రాల్లో నగదు చోరీకి గురైతే వాటికి ముందుగానే బీమా చేయించి ఉండడంతోనే అధికారులు అలసత్వం వహిస్తున్నారన్న విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. ఎంత నగదు పోయినా బీమా క్లయిమ్ ద్వారా తిరిగి పొందేందుకు వీలు ఉండడంతోనే అధికారులు ఇలా వ్యవహరిస్తున్నారని ఖాతాదారులు ఆరోపిస్తున్నారు. ప్రజల సొమ్ముతో నడిచే బ్యాంకు అధికారులు నెల జీతాలు తీసుకోవడంలో చూపించే శ్రద్ధ, ఏటీఎం కేంద్రాల నిర్వహణ, ఖాతాదారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంలో కాస్త అయినా చూపించాలని కోరుతున్నారు. ఏది ఏమైనా మరో భారీ చోరీ చోటు చేసుకోకముందే అధికారులు, సెక్యూరిటీ సిబ్బందిని ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.





చంద్రగిరి బస్టాండ్ సమీపంలోని ఏటీఎం కేంద్రంలో సేద తీరుతున్న శునకం, పాతపేటలో రక్షణ లేని ఏటీఎం



కొత్తపేట ఏటీఎంలో కానరాని సెక్యూరిటీ సిబ్బంది

గజరాజు మహత్యమే..!



గోవిందరాజస్వామి గుడి నుంచి డెయిరీ ఫామ్‌కు వెళ్లుతున్న గజరాజులు



గజరాజు డంగ్‌ను పాదాల భారాన్ని, పగుళ్లను తగ్గించుకునేందుకు తొక్కుతున్న ప్రజలు

గజరాజును సాక్షాత్తు దైవస్వరూపంగా భావిస్తాం. గజరాజు తొండంతో ఆశీర్వదిస్తే పాపాలు తొలగిపోతాయని, ఆ ఏడాది ఎటువంటి దుష్టశక్తులు మనిషిని ఆవరించవనే నానుడి మన పూర్వీకుల నుంచి వస్తోంది. దీంతోపాటు స్వయాన పార్వతీ తనయుడి గజముఖ స్వరూపంతో ఉన్న ఏనుగుల మలవిసర్జన (లద్దె) ఒక దివ్య ఔషధంగా పనిచేస్తుందని భావిస్తారు. గజరాజుల మలవిసర్జనను పాదాలతో తాకితే పగుళ్లకు, పాద ఎముకుల పటుత్వానికి పనిచేస్తుందని అపార నమ్మకం. ఈ నమ్మకంతోనే ఆదివారం స్థానిక న్యూ బాలాజీ కాలనీలో గోవిందరాజస్వామి ఆలయం నుంచి టీటీడీ గోశాలకు వెళ్లే గజరాజులు వేసిన లద్దె(డంగ్)ను చూసిన స్థానిక ప్రజలు ఒక్కసారిగా పరిగెడుతూ వచ్చి కాళ్లతో తొక్కారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

ఆహ్వాన కరపత్రాల ఆవిష్కరణ



వినాయక చవితి ఆహ్వాన కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అతిథులు, కమిటీ సభ్యులు

తిరుపతి కల్చరల్: నగరంలో ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు జరిగే వినాయక చవితి, సామూహిక నిమజ్జనోత్సవాలకు ప్రజలను ఆహ్వానిస్తూ వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ ముద్రించిన ఆహ్వాన కరపత్రాలను ఆదివారం కమిటీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, మాజీ తుడా చైర్మన్ నరసింహ యాదవ్, కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఉత్సవ కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్ మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా ఆధ్యాత్మిక నగరంలో అందరి సహకారంతో వినాయక చవితి, సామూహిక నిమజ్జనోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది కూడా మరింత ఘనంగా ఉత్సవాలను నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఇందుకు అన్ని ప్రభుత్వ శాఖలు, పట్టణ ప్రముఖులు, అన్ని వర్గాల ప్రజల సహకారం అందించాలని కోరారు. అందరి సమన్వయంతో ఈ ఏడాది ఉత్సవాలను పూర్తి స్థాయిలో విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు వెంకటేష్, కరాటే శ్రీనివాస్, చెన్ననవీన్, భానుప్రకాష్‌రెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి, మబ్బుదేవనారాయణరెడ్డి, సుబ్బురాయల్, హేమ, కిరణ్, బాలభాస్కర్, గోపినాథ్ రెడ్డి ఏంవీ.సాయిప్రసాద్, వంశీరెడ్డి, ఆనంద్, ఆముల వెంకటేష్, వేణుగోపాల్, హేమంత్, బాలాజీ, విజయకుమార్ పాల్గొన్నారు.

డ్రగ్స్ మహమ్మారిని తరిమికొడదాం

బుచ్చినాయుడుకండ్రిగ: డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టేందుకు యువత ముందుకు రావాలని ఎస్ఐ విశ్వనాథనాయుడు పిలుపునిచ్చారు. ఆయన ఆదివారం కాటూరు గ్రామంలో డ్రగ్స్ ఫ్రీ ఇండియా అనే అంశంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. డ్రగ్స్ లేకుండా చేస్తామని వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఆయన మాట్లాడుతూ మత్తుకు బానిసైతే జీవితం నాశనం అవుతుందని, మత్తు పదార్థాలను వాడడం చట్టరీత్యా నేరమని తెలిపారు. యువత మత్తుకు బానిసైతే కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. డ్రగ్స్ వినియోగించినా, విక్రయించినా పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ నాగరాజు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

యంగ్ ఎంప్లాయీస్ సేవలు ప్రశంసనీయం



బహుమతులను అందజేస్తున్న డీఎస్పీ

శ్రీకాళహస్తి: యంగ్ ఎంప్లాయీస్ సోషల్ సర్వీస్ సేవలు ప్రశంసనీయమని డీఎస్పీ నరసింహమూర్తి అన్నారు. యంగ్ ఎంప్లాయీస్ సంస్థ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి, మండల పరిధిలోని 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు పర్యావరణపరిరక్షణ అనే అంశంపై చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. అందులో భాగంగా పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం విజేతలకు బహుమతులను అందజేశారు. శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పచ్చదనాన్ని పెంపొందించేందుకు కృషిచేయాలన్నారు. జాతీయ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత సురేష్ బాబు, సంస్థ సభ్యులు హేమకుమార్, మునస్వామి, నారాయణ పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన



మహిళను పరీక్షిస్తున్న డాక్టర్ వెంకటరమణ

తిరుపతి తుడా: తిరుపతిలోని వెంకటరమణ హార్ట్ అండ్ మెటర్నిటీ ఆస్పత్రిలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. ఆస్పత్రి 18వ వార్షికోత్సవం సందర్భంగా ఈ మెడికల్ క్యాంపును నిర్వహించారు. వైద్య శిబిరంలో పాల్గొన్న రోగులకు ఈసీజీ, ఆర్బీఎస్, ఎకో, యుఎస్‌జి, స్కానింగ్ వంటి పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. ఆస్పత్రి డైరెక్టర్లు డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ నిరుపమ మాట్లాడుతూ ఈ 18 ఏళ్ల ప్రస్థానంలో రోగులకు ఆధునిక వైద్యాన్ని అందించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు.

ఆస్టర్ కు అనూహ్య స్పందన



మహిళలను పరీక్షిస్తున్న వైద్యసిబ్బంది

తిరుపతి తుడా: తిరుపతి ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్, ప్రకాశం పార్క్ వాకర్స్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. తిరుమల బైపాస్ రోడ్డులోని ప్రకాశం పార్కులో ఆదివారం మెగా మెడికల్ క్యాంపును నిర్వహించారు. తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ముఖ్య అతిథిగా విచ్చేసి మెడికల్ క్యాంపును ప్రారంభించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో 280 మందికి ప్రాథమిక వైద్య పరీక్షలను నిర్వహించారు. చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్ ముని, కృష్ణ ప్రసాద్, వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మండపాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి

పాకాల: వినాయక చవితి సందర్భంగా విగ్రహ మండపాలు ఏర్పాటు చేయదలచి వారు తప్పనిసరిగా అనుమతులు పొందాలని సీఐ మద్దయ్య ఆచారి తెలిపారు. ఆదివారం సీఐ మాట్లాడుతూ, ప్రభుత్వం సింగిల్‌విండో క్లియరెన్స్ విధానాన్ని ప్రవేశ పెట్టిందని, వినాయక విగ్రహ మండపం ఏర్పాటుకు 7995095800 నంబర్‌కు వాట్సాప్‌లో హాయ్ అని మెసేజ్ చేస్తే మండపాల పరంగా అనుసరించవలసిన, పాటించవలసిన ప్రక్రియ మొత్తం మొబైల్ ఫోన్‌కి వస్తుందని తెలిపారు. అలాగే, వినాయక విగ్రహ మండపం ఏర్పాటు చేయడానికి గణేష్ జీఏఎస్ఈఎస్‌హెచ్‌యుఏటీఎస్ఏవి.ఏపిపోలీస్.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ప్రజలు సమీప మీ–సేవ కేంద్రాల్లో తగిన రుసుం చెల్లించి ఆ రుసుం పత్రాన్ని తెలిపిన వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. వీటిని ఎస్‌హెచ్‌ఓ పరిశీలించి ఎన్‌ఓసీ పత్రాన్ని జారీ చేస్తారని తెలిపారు. ఈ పత్రాన్ని ప్రింట్ తీసి ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో ఉంచాలన్నారు. పోలీసులు సందర్శించిన సమయంలో క్యూఆర్ కోడ్‌ని స్కాన్ చేసి తనిఖీ చేస్తారని తెలిపారు. నియమ నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నాలుగు దశాబ్దాల స్నేహ గీతం



గురువులతో పూర్వ విద్యార్థులు

పాకాల: మండలంలోని దామలచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 1983–84లో పదవ తరగతి చదివిన అప్పటి విద్యార్థులు ఇక్కడ సమావేశమయ్యారు. తమ ఉన్నతికి బాటలు వేసిన గురువులను సన్మానించి ఆశీస్సులు అందుకున్నారు. ఒకనాటి స్నేహితులు తాతలుగా, అమ్మమ్మలుగా, నానమ్మలుగా మారిని వారిని గుర్తుపట్టి ఆత్మీయ పలకరింపులతో సందడి చేశారు. స్కూలు అభివృద్ధికి తమవంతు సహకారం ఇస్తామని ప్రకటించారు. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు పుల్లూరు ఆనందయ్య, కార్యదర్శి నారాయణ, ఉపాధ్యక్షుడు సుధాకర్ నాయుడు, సహాయ కార్యదర్శి గంధం వెంకటముని, పి.సుబ్రమణ్యం, ఇ.గోవిందు, టి.రామకృష్ణ, ఎస్.చంద్రశేఖర్, మహమ్మద్ రఫీ, ఖాదర్‌బాషా, శ్యామల, రాధ, వరలక్ష్మి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

కార్డన్ సెర్చ్

శ్రీకాళహస్తి: తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు ఆదివారం తెల్లవారుజామున 1వ పట్టణ పోలీసులు ఎన్టీఆర్‌నగర్, జయరామరావు వీధిలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. అందులోభాగంగా 1వ పట్టణ సీఐ గోపి, రెండవ పట్టణ సీఐ వెంకటేశ్వర్లు, రూరల్ సీఐ రవినాయక్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో సరైన రికార్డులులేని 12 మోటార్ సైకిళ్లు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు.

సరుకుల పంపిణీ

శ్రీకాళహస్తి: పట్టణంలోని నగరి వీధిలోని హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో ఆదివారం 156వ నెల ఉచిత సరుకులను దివ్యాంగులు, వృద్ధులకు అందజేశారు. సంస్థ సభ్యులు గరికపాటి రమేష్‌బాబు మాట్లాడుతూ ఇన్నినెలలుగా నిత్యావసర సరుకులు అందించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

రాజీవ్‌నగర్‌లో సమస్యల తిష్ట

- కక్షసాధింపులతో సరి
- మూడు నెలలుగా ఇదే పరిస్థితి
- అభివృద్ధిని పట్టించుకోని పాలకులు
- అమృత్‌నగర్ నిధులైనా కేటాయిస్తారో లేదో?



రాజీవ్‌నగర్‌లోని మట్టిరోడ్లు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణానికి కూత వేటు దూరంలో ఉన్న రాజీవ్ నగర్ అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిపోయింది. గత ప్రభుత్వ హయాంలో ఇళ్లు, రోడ్లు కేటాయించినా వాటికి కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రస్తుత పాలకులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వైఎస్సార్‌సీపీ నేతలపై కక్షగట్టి అక్రమ నిర్మాణాల పేరుతో భవనాలు కూలదోయడానికే పాలకులు ప్రాధాన్యమిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు.

మట్టిరోడ్లే దిక్కు

రాజీవ్ నగర్‌లో గత ప్రభుత్వం జగనన్న కాలనీ ఏర్పాటు చేసి, పేదలకు రెండు వేల ఇళ్లు మంజూరు చేసింది. అలాగే దివంగత మహానేత వైఎస్సార్ హయాంలో ఐదు వేల ఇళ్లు, టిడ్కో గృహాలు నాలుగు వేలు ఇలా.. మొత్తం పది వేల గృహాలు ఉన్నాయి. గత ప్రభుత్వం మౌలిక సుదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు సిద్ధం చేసినా.. అంతలోనే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అభివృద్ధి పనులు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. విద్యుత్ స్తంభాలు, బోర్లు, ప్రధాన రహదారి మరమ్మతులు అలాగే ఉండిపోయాయి. చిన్న వర్షానికే కాలువలు లేకపోవడంతో వీధులు జలమయమవుతున్నాయి. కాలువలు, సిమెంటు రోడ్ల ఊసే లేదు. నేలకు సమాంతరంగా ఉన్న ఓ బావి ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. ఈ ప్రాంతంలో ఒక పాఠశాల గానీ, అంగన్‌వాడీ కేంద్రం లేకపోవడం స్థానికులను బాధిస్తోంది. ఇళ్ల చుట్టూ అడవిని తలపించే విధంగా చెట్లు పెరిగిపోయాయి. విషపురుగుల బెడద అధికమైందని స్థానికులు వాపోతున్నారు.

అమృతనగర్ నిధులైనా కేటాయిస్తారా?

శ్రీకాళహస్తి పట్టణానికి అమృతనగర్ నిధులు భారీగా విడుదలయ్యాయి. ఈ నేపథ్యంలో అభివృద్ధి చెందిన, ధనికులు ఉండే ప్రాంతాలకే ఈ నిధులు కేటాయించకుండా రాజీవ్ నగర్‌లాంటి ప్రాంతాలపై దృష్టి పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

మా పిల్లల భవిష్యత్తు ప్రశ్నార్థకం



అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాల లేకపోవడంతో పిల్లలకు ఇబ్బందికరంగా మారింది. సాధ్యమైనంత త్వరగా ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలి. అంగన్‌వాడీ కేంద్రానికి పంపించాలంటే కిలోమీటరు ఉంది. నాలుగువేల కుటుంబాలు ఉండే ప్రాంతాల్లో అంగన్‌వాడీ కేంద్రం లేకపోవడం బాధాకరం.

– లక్ష్మి, రాజీవ్‌నగర్ కాలనీ

మౌలిక సదుపాయాలు కల్పించండి



రాజీవ్‌నగర్‌లో రోడ్లు, కాలువలు, వీధి దీపాలు, తాగునీటి సౌకర్యం కల్పించాలి. దీపాలు ఉన్నా వెలగడంలేదు. వెంటనే మరమ్మతులు చేసి వెలిగే విధంగా చర్యలు తీసుకోవాలి. పేదవారికి అవసరమైన మౌలిక సదుపాయాలు రాజీవ్‌నగర్‌లో కల్పించాలి.

– బాలచంద్ర, రాజీవ్‌నగర్ కాలనీ